

దొంగిలించిన వాహనాలను కొనుగోలు చేయొద్దు : ఎస్సై

బిచ్కుంద, ఆగస్టు 7: దొంగిలించిన వాహనాలను కొనుగోలు, అమ్మకాలు చేయొద్దని బిచ్కుంద ఎస్సై మోహన్‌రెడ్డి మెకానిక్‌లకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ద్వి చక్రవాహనాల మెకానిక్‌లతో పోలీసుస్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్వి చక్ర వాహనాలు కొనుగోలు అమ్మకాలు జరిపేటప్పుడు సరైన ధ్రువపత్రాలను పరిశీలించాలన్నారు. అనుమానాస్పదంగా అనిపిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. అధిక సౌండ్ ఉన్న సైలెన్సర్‌ను బిగించడం లాంటివి చేయొద్దని ఎస్ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో మెకానిక్ అబ్బాస్, సందీప్, భాను తదితరులు పాల్గొన్నారు.






ఈ సీజన్‌కు రైతుభరోసా

లేనట్టేనా?

- పెట్టుబడి సాయానికి రైతులకు తప్పని నిరీక్షణ
- ప్రస్తుతం రుణమాఫీపైనే ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- వచ్చే యాసంగి సీజన్‌లోనే పెట్టుబడి సాయం
- రైతు భరోసాకు అభిప్రాయాల సేకరణలో ప్రభుత్వం
- విధి విధానాలపై ప్రభుత్వం కసరత్తు
- సబ్ క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నాకే పెట్టుబడి సాయం

కామారెడ్డి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులు పెట్టుబడి సాయం కోసం ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో అమలు చేసిన రైతుబంధు పథకానికి బదులు రైతుభరోసా పథకా న్ని అమలు చేస్తామ ని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకు గాను విధి విధానాలను ఖరారు చేసేందుకు ఇప్పటికే మంత్రివర్గ ఉప సంఘాన్ని వేయడంతో పెట్టుబడి సాయం ఆలస్యంగానే అందనుంది. అయితే రైతుభరోసా పథకాన్ని అమలు చేసేందుకు రాష్ట్రప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ చేపడుతోంది.



జిల్లాల వారీగా మంత్రివర్గ ఉప సంఘం పర్యటిస్తూ రైతుభరోసాపై సమావేశాలు ఏర్పాటు చేస్తూ అభిప్రాయాలు తీసుకుంటున్నారు.

గత పక్షం రోజుల కిందటే ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వారీగా రైతుభరోసాపై మంత్రివర్గ ఉప సంఘం సమావేశం కావాల్సి ఉండగా రుణమాఫీ నేపథ్యంలో వాయిదా వేశారు. ప్రస్తుతం రుణమాఫీపైనే రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఇప్పటికే రెండు విడతల్లో రైతుల పంట రుణాలను మాఫీ చేసిన విషయం తెలిసిందే. ఈనెల 15కల్లా మూడో విడత రుణమాఫీకి ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇప్పటికే వానాకాలం సీజన్ సైతం సగం ముగిసింది. ఈ నేపథ్యంలో రైతుభరోసా నిధులు ఈ సీజన్‌లో ప్రభుత్వం ఇచ్చేటట్లు కనిపించడం లేదు. వచ్చే యాసంగి సీజన్‌లోనూ రైతుల ఖాతాలో భరోసా నిధులను జమచేసే అవకాశం ఉందని అధికారవర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో రైతులకు పెట్టుబడి సాయం నిధులకై నిరీక్షణ తప్పడం లేదు.

రైతు బంధును.. రైతు భరోసాగా..

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తాము అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. అందులో భాగంగా రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తామని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా ఒక్కో ఎకరానికి రెండు సీజన్‌లకు కలిపి రూ.15 వేలు కౌలు రైతులకు కూడా అంతే మొత్తాన్ని, రైతుకూలీలకు రూ.12వేల చొప్పున అందజేస్తామని ప్రకటించింది. అంతకుముందు ఇదే పథకాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని అమలు చేసింది. పట్టా కలిగిన వారందరికి సీజన్‌కు రూ.5వేల చొప్పున రెండు సీజన్‌లకు రూ.10వేలు పెట్టుబడి సాయాన్ని అందజేసింది. ఇందులో కౌలు రైతులకు ఎలాంటి సాయాన్ని అందజేయలేదు. ఈ పథకం అమలు చేసేందుకు అప్పటి ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను అనుసంధానం చేసుకుని నేరుగా రైతుల ఖాతాలో డబ్బులను జమ చేసింది. ఈ క్రమంలో సాగులో ఉన్న, సాగులో లేని భూములు, రహదారులు, ప్రాజెక్టుల కింద సేకరించిన భూములకు, నాలా మార్పిడి చేయకుండా వెలువడిన రియల్ ఎస్టేట్ వెంచర్లకు, భూస్వాములకు, ప్రభుత్వ ఉద్యోగులకు సైతం ఎలాంటి విధి విధానాలు రూపొందించకుండానే అప్పటి ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని అమలు చేసింది. ఈ పథకం ద్వారా జిల్లాలో 3.15లక్షల మంది రైతులకు సుమారు రూ.220 కోట్లను చెల్లించింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుబంధు పథకాన్ని సవరించి తాము ప్రకటించిన రైతుభరోసా పథకాన్ని అమలు చేయాలని భావించింది. గడిచిన యాసంగి సీజన్‌లో పాత విధానంలోనే రైతులకు పెట్టుబడి సాయాన్ని అందించింది.

అభిప్రాయ సేకరణ చేపడుతున్న మంత్రి వర్గ ఉప సంఘం

వానాకాలం సీజన్ ఇప్పటికే సగం ముగిసింది. రైతులు పెట్టుబడి సాయం కోసం ఎదురు చూస్తున్నారు. ప్రతీ వానాకాలం, యాసంగి సీజన్ ప్రారంభమయ్యే ముందట రైతుబంధు కింద ఎకరానికి రూ.5వేల చొప్పున పెట్టుబడి సాయాన్ని అందించేది. గడిచిన యాసంగి సీజన్ సైతం కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టుబడి సాయం నిధులను రైతుల ఖాతాలో జమ చేసింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త పథకాన్ని అమలు చేస్తారా, పాత పథకం ప్రకారమే పెట్టుబడి సొమ్మును ఖాతాలో జమ చేస్తారా అని రైతులు చర్చించుకుంటున్నారు. దాని కంటే ముందు పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఆగస్టు 15వ తేదీ వరకు రైతులకు రూ.2లక్షల రుణమాఫీ పథకాన్ని అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఇందులో భాగంగా రైతు రుణమాఫీపైనే ప్రభుత్వం దృష్టి సారించింది. పంట రుణాలను ప్రభుత్వం మాఫీ చేస్తోంది. రైతుభరోసా పథకాన్ని అమలు చేసేందుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగిలేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబు సభ్యులుగా ఉప సంఘాన్ని నెలరోజుల కిందటే నియమించారు. ఈ ఉప సంఘం రైతు సంఘాలు, రైతుకూలీ సంఘాలు రాజకీయ పార్టీ నాయకులు వివిధ వర్గాల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించేందుకు జిల్లాల పర్యటనలు చేస్తున్నారు. రైతుభరోసా అమలుకు మంత్రివర్గ ఉప సంఘం ఇప్పటికీ అభిప్రాయ సేకరణలోనే ఉంది.

రైతు భరోసా అనర్హుల ఏరివేత

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయాన్ని అందించేందుకు రైతుభరోసా పథకాన్ని అమలు చేసేందుకు చర్యలు చేపడుతోంది. ఈ పథకాన్ని అనర్హులను ఏరివేసేందుకు ప్రభుత్వం పక్కా వ్యూహంతో ముందుకు వెళ్తున్నట్లు తెలుస్తోంది. ఈ పథకం అమలు చేసేందుకు 5 ఎకరాల వరకు పరిమితం చేసే సూచనలు కనిపిస్తున్నాయి. కొండలు, గుట్టలు, బండరాయి భూములు, సాగుకు యోగ్యం కాని భూములను, ప్రజా ప్రయోజనాల కోసం ప్రభుత్వం సేకరించిన భూములను, ప్రభుత్వ ఉద్యోగుల భూములను, రహదారులు, నాలా కన్వర్షన్ లేకుండా వెంచర్‌లుగా మార్చిన భూములను పథకం నుంచి తొలగించనున్నారు. అదేవిధంగా ఐటీ చెల్లింపుదారులు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులకు రైతు భరోసా అందకుండా చేసేందుకు ప్రభుత్వం విధి విధానాలను ఖరారు చేస్తోంది. అలాగే కౌలు రైతులు చేస్తున్న కౌలుకు చేస్తున్న భూముల యజమాను లకు కాకుండా రైతుభరోసా కింద పెట్టుబడి సాయాన్ని సదరు కౌలు రైతుకు కొంత, పట్టాదారులకు కొంత సాయాన్ని అందించే అవకాశాలు ఉన్నాయి. విధివిధానాలు ఖరారు అయిన తర్వాతనే ఈ సీజన్ నుంచి గాని, వచ్చే యాసంగి సీజన్ నుంచి గాని ప్రభుత్వం పెట్టుబడి సాయాన్ని అందించే అవకాశాలు ఉన్నాయి.

ఫలించిన విద్యార్థుల ఆందోళన



నాగిరెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పాఠాలు బోధిస్తున్న అధ్యాపకుడు

నాగిరెడ్డిపేట, ఆగస్టు 7: విద్యార్థుల ఆందోళన ఫలితంగా నాగిరెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అధికారులు ఇద్దరు లెక్చరర్లను డిప్యూటేషన్‌పై పంపించడంతో బుధవారం కళాశాలలో విద్యాబోధన తిరిగి ప్రారంభమైంది. మండల కేంద్రంలో కొత్తగా మంజూరైన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గత ఆరు రోజులుగా లెక్చరర్లు రాక పాఠాలు బోధించే వారు లేకపోవడంతో కళాశాలలో లెక్చరర్‌లను నియమించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో మంగళవారం కళాశాల విద్యార్థులు ఆందోళన బాట పట్టి, మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై రాస్తారోకో చేసిన సంగతి పాఠకులకు తెలిసిందే. విద్యార్థులు చేసిన ఆందోళన ఫలితంగా జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించారు. ఎల్లారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫిజిక్స్ లెక్చరర్‌గా పని చేస్తున్న నాగయ్యను, పిట్లం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎకనామిక్స్ లెక్చరర్‌గా పని చేస్తున్న విష్ణును నాగిరెడ్డిపేట ప్రభుత్వ జూని యర్ కళాశాలకు డిప్యూటేషన్‌పై పంపిస్తూ జిల్లా ఇంటర్ విద్యా నోడల్ అధికారి షేక్ సలాం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఇద్దరు లెక్చరర్లు వారంలో మూడు రోజులు సంబంధిత కళాశాలలోనే విధులు నిర్వహిస్తూనే మరో మూడు రోజులు నాగిరెడ్డిపేట కళాశాలలో విధులు నిర్వహించి విద్యార్థులకు విద్యాబోధన జరపాలని ఆయన ఆదేశించారు. జిల్లా నోడల్ అధికారి ఆదేశాల మేరకు నాగయ్య, విష్ణు ఇద్దరు లెక్చరర్లు బుధ వారం నాగిరెడ్డిపేట కళాశాలకు వచ్చి విద్యార్థులకు పాఠాలు బోధించారు. గత ఆరు రోజులుగా లెక్చరర్లు కళాశాలకు రాక, విద్యాబోధన జరగక పోవడంతో తీవ్ర నిరాశకు లోనైన విద్యార్థులు తమ ఆందోళన ఫలితంగా ఉన్నతాధికారులు స్పందించి కళాశాలకు లెక్చరర్లను పంపించడంతో వారు ఆనందం వ్యక్తం చేశారు.

సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళుతా : మాజీ జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల సమస్యలను జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరి ంచేలా కృషి చేస్తానని స్థానిక మాజీ జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం కళాశాలకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడి విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు. ప్రస్తుతం అధికారులు ఇద్దరు లెక్చరర్లను పంపించినందున మరికొందరు లెక్చరర్లను తగిన ఫర్నిచర్‌ను ఈ కళాశాలకు పంపించే విధంగా అధికారులను సంప్రదిస్తానని ఆయన తెలిపారు.

ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలి : కలెక్టర్



దోమకొండలో జెండా ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

దోమకొండ, ఆగస్టు 7: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశభ్రత పాటించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. బుధవారం లింగుపల్లి, దోమకొండ, సంగమేశ్వర్ గ్రామాల్లో కలెక్టర్ పర్యటించారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా లింగుపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ భవనం, పాఠశాల ఆవరణలో పరిసరాలను పరిశీలించారు. దోమకొండలోని ఆనంద్ భవన్‌లో గడికోట మేనేజర్ బాబ్జి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా మహిళా సంఘ సభ్యులతో కలసి జెండాను ఆవిష్కరించారు. సీహెచ్‌సీలో ఎక్సరే గది, స్కానింగ్, ముత్రశాలలు, ఓపీలను పరిశీలించి రోగులతో మాట్లాడారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ప్లాస్టిక్ కవర్లను కలెక్టర్ ఏరి చెత్త బుట్టలో వేసి శ్రమదానం చేశారు. పశువైద్యశాలలో వైద్యులతో కలసి మొక్కను నాటారు. ఎంఎల్ఎస్ పాయింట్‌ను తనిఖీ చేసి గోదాంలో ఉన్నటువంటి స్టాక్ వివరాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ కిష్టయ్యను అడిగారు. అనంతరం ఎస్సీ బాలుర హాస్టల్ వద్ద వనమహోత్సం కార్యక్రమంలో భాగంగా మహిళా సంఘాల సభ్యులతో కలసి మొక్కలను నాటారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో వ్యాస రచన పోటీల్లో ప్రతిభ కనబర్చిన ముగ్గురు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సంగమేశ్వర్ గ్రామంలో చేపల చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పరిశుభ్రత పాటించాలని, ఇంట్లో, కాలనీల్లో ప్రతి ఒక్కరూ శుభ్రంగా ఉండే విధంగా కృషి చేయాలన్నారు. గ్రామాల్లో మురికి లేకుండా అందంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. వృద్ధులు పింఛన్ తీసుకోవాలంటే ఇబ్బందులు పడుతున్నారని వారికి తమ ఖాతాల్లోనే పింఛన్ డబ్బులు జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ మాజీ జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి భాగ్యలక్ష్మీ, డీపీవో శ్రీనివాస్, డీఎల్‌పీవో శ్రీనివాస్, పీడీ సురేందర్, సుధాకర్, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, తహసీల్దార్ సంజయ్‌రావు, ఏవో పవన్, ఏఈలు బాలక్రిష్ణ, శిరీష, రమేష్, సౌజన్య, మధు, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

'రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి'

బోధన్‌రూరల్,ఆగస్టు7: బస్తీ దవాఖానాలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్‌లో గల బస్తీదవాఖానాను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బస్తీ దవాఖానాలో వైద్యులను నియమిస్తామన్నారు.అలాగే బోధన్ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసూతి విభాగంలో గైనాకాలజిస్టు వైద్యురాలిని నియమిస్తున్నామన్నారు. ప్రజలు సమన్వయం పాటిస్తూ వైద్యసేవలు అందుకోవాలన్నారు. ఆయన వెంట ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, మానాల మోహన్ రెడ్డి, పాషా మొయినోద్దీన్, పీసీసీ డెలిగేట్ గంగాశంకర్, కౌన్సిలర్లు శరత్ రెడ్డి తదితరులున్నారు.

మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం



రామన్నపేట్‌లో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

వేల్పూర్, ఆగస్టు7:మండల గ్రామమైన రామన్నపేట్‌లో తెడ్డు మాదిగ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఎస్సీవర్గీకరణ కోసం చేసిన ఉద్యమస్ఫూర్తిని మాదిగలు కొనియాడుతూ గ్రామంలోని ప్రధాన వీధులగుండా ర్యాలీ నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసుకోవచ్చని సుప్రీంకోర్టు ఏడుగురు న్యాయవాదుల బెంచీ తీర్పు ఇవ్వడం హర్షనీయమన్నారు. మాదిగ, మాదిగ ఉపకులాల వారు 30ఏళ్ల ఉద్యమం ఫలితం మాదిగ ఉపకులాలకు న్యాయం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో తెడ్డు మాదిగ సంఘం నాయకులు పాల్గొన్నారు.

నవీపేట: మండల కేంద్రంలోని దర్యాపూర్ అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగల చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు ఇటీవల అనుకూలంగా తీర్పు ఇవ్వడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాణాసంచా కాల్చి స్వీట్లు పంచుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మానికోళ్ల గంగాధర్, జీవన్, బీజేపీ నాయకులు గణేష్, తదితరులు పాల్గొన్నారు.

వర్ని: సుప్రీంకోర్టు తీర్పును హర్షిస్తూ బుధవారం వర్ని మండల కేంద్రంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ పోరాట కృషి ఫలితమే కోర్టు తీర్పుకు నిదర్శనంగా వారు అభిప్రాయపడ్డారు. తీర్పునిచ్చిన న్యాయమూర్తులకు ధన్యవాదాలు తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందజేయాలి

● అదనపు కలెక్టర్ అంకిత్



భీమ్‌గల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్



జానకంపేటలో నాటిన మొక్కలను పరిశీలించిన డీఆర్డీవోపీడీ



ధర్మారం(బి)లో మొక్కను నాటుతున్న జడ్పీ సీఈవో ఉషా

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు7: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం నాణ్యమైన భోజనం అందజేయాలని అదనపు కలెక్టర్ అంకిత్ ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం భీమ్‌గల్ పట్టణంలో స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా బాలికల ఉన్నత పాఠశాల, మైనారిటీ పాఠశాలను అదనపు కలెక్టర్ అంకిత్ సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని సందర్శించారు.మధ్యాహ్న భోజనం వండే ప్రదేశం, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు.ఈసందర్భంగా మైనారిటీ పాఠశాలలో అదనపుకలెక్టర్ అంకిత్ మొక్కలునాటారు. ఈ కార్య క్రమంలో కమిషనర్ రామకృష్ణ, ఎంఈవో స్వామి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ కన్నె ప్రేమలత సురేందర్, వైస్‌ఛైర్మన్, కౌన్సిలర్‌లు,అధికారులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: సీజనల్‌వ్యాధులబారిన ప్రబకుండా ప్రతీ ఒక్కరు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని అదనపు అంకిత్ అన్నారు. బుధవారం మండలంలోని హసాకొత్తూర్ గ్రామంలో నిర్వహించిన స్వచ్ఛదనం-పచ్చనం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాలప్లేగ్రౌండ్‌లో మొక్కలను నాటారు. గ్రామప్రత్యేక అధికారి ఆంధ్రయ్య, ఎంపీవో సదాశివ్, ఏపీవో విద్యానంద్, పంచాయతీ కార్యదర్శి నర్సయ్య, స్థానిక కాంగ్రెస్ నాయకులు, ఈజీఎస్ టీఏలు, ఎఫ్ఏ, గ్రామస్థులు, అంగన్‌వాడీ టీచర్లు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాలను ప్రజలు విజయవంతం చేయాలని డీఆర్‌డీవో పీడీ సాయాగౌడ్ అన్నారు. బుధవారం బోధన్ మండలంలోని బెల్లాల్, అమ్దాపూర్ తదితర గ్రామాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయాలలో మొక్కలు నాటారు. ఆయన వెంట ఎంపీడీవో, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్థులు ఉన్నారు.

● సాలూరలో..

సాలూర మండల కేంద్రంలో తహసీల్దార్ రమేష్ స్థానిక జడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్ అల్లె జనార్దన్, ఈవో ప్రవీణ్, హెడ్‌మాస్టర్ మంజూష, ఐకేపీ మణి, అమ్మ ఆదర్శ పాఠశాల ఛైర్మన్ షమీమ్ భాను, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

నందిపేట: గ్రామాల్లో చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యత అని జిల్లా పంచాయతీ అధికారి తరుణ్ అన్నారు. బుధవారం నందిపేట మండలంలోని ఆంధ్రనగర్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అలాగే నందిపేట మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో నిర్వహించిన స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ దాదన్నగారి విఠల్‌రావుతో కలిసి డీపీవో తరుణ్ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీపీవో తరుణ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. ముఖ్యంగా ప్రజలకు పారిశుధ్యం, ఆరోగ్యం గురించి అవవగాహన కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ దాదన్నగారి విఠల్ రావు మాట్లాడుతూ నాటిన ప్రతీ మొక్కను పెంచే బాధ్యత విద్యార్థులు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్ రావు, కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపాల్ శాంతికుమారి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మందమహిపాల్, నియోజక వర్గం యువజన నాయకులు బైండ్లప్రశాంత్, ఆంధ్రనగర్, నందిపేట మాజీ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శి వివిధ శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

ఎడపల్లి: నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని వాటిని సంరక్షించినపుడే నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకుంటామని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ సాయాగౌడ్ అన్నారు.బుధవారం ఎడపల్లి మండలంలోని జానకంపేట గ్రామశివారులలోని శ్రీలక్ష్మి నర్సింహస్వామి ఆలయం వద్ద నాటిన మొక్కలను ఆయన పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు ఎంపీడీవో,ఏపీవో, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

రుద్రూరు: మండల కేంద్రంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో నిర్వహించారు. గ్రామంలోని పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల ప్రత్యేక అధికారి నిర్మల, ఎంపీడీవో సురేష్‌బాబులు పేర్కొన్నారు.బుధవారం రుద్రూరు మండల కేంద్రంలో మూడోరోజు స్వచ్ఛ దనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య పనులు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద పరిసరాలను పరిశుభ్రం చేయడం, మురికి కాలు వలను తీయించారు.ఈ కార్యక్రమాలలో డిప్యూటీ తహసీల్దార్ సురేందర్ నాయక్, ఆర్ఐ నజీర్, హెల్త్‌సూపర్ వైజర్ రవి, ఏపీవో మనోహర్, జీపీ కార్యదర్శి గంగాధర్, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముప్కాల్: బాల్కొండ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బాల్కొండ నియోజకవర్గ అధికారులతో నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధిపై బుధవారం మాజీమంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో ప్రభుత్వ పథకాలు, కొనసాగుతున్న అభివృద్ధి పనులు ప్రజలకు చేరడంలో ఉన్న ఇబ్బందులు తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతు రుణమాఫీ, ధరణి సమస్యలు, ఎన్ఎంఆర్ ఈజీఎస్ పనులు, ఉచిత సిలిండర్, 200యూనిట్ల విద్యుత్,పాఠశాల సంబంధించిన, వివిధ అంశాలపై పడుతున్న ఇబ్బందులు, వాటిపరిష్కరించడంలో తీసుకుంటున్న చర్యలపై అధికారులతో సమీక్షించారు.అంతకు ముందు స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో, నియోజకవర్గంలోని అన్ని మండలాల తహసీల్దార్, ఎంపీడీవోలు, మండలఅధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: మండలంలోని బినోల, ఆశాజ్యోతి కాలనీలలో బుధవారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఖాళీ స్థలాలలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు శ్రీకాంత్, శ్రీవాణి అన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ఒడ్డెరకాలనీ ప్రభుత్వ పాఠశాలలో వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు.రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా పాఠ శాల ఆవరణలో స్థానిక కౌన్సిలర్ ఖాందేశ్ సంగీత మొక్కలను నాటారు. ప్రతీ ఒక్కరు మొక్కలకు నీళ్లు పోసి సంరక్షించాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఖాందేశ్ సత్యం, మున్సిపల్ అధికారులు షకీల్, చక్రధర్, ప్రధానోపాధ్యాయుడు తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి:రాష్ట్రప్రభుత్వం మహోన్నతఆశయంతో ప్రవేశపెట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో అందరు భాగస్వాములు కావాలని పచ్చదనం కోసం మొక్కలునాటి పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణాధికారి ఉషా అన్నారు. బుధవారం స్వచ్ఛభారత్ పచ్చదనంలో భాగంగా మండలంలోని ధర్మారం(బి)లో ఆరోగ్య కేంద్రం, అంగన్‌వాడీ భవనం పరిసరాలను పరిశుభ్రం చేసి మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మురుగు కాల్వలు నిండి పోకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని రక్షిత ట్యాంకులను క్లోరినేషన్ చేస్తూ తాగు నీటిని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి యోహన్, ఎంపీడీ వో రవీందర్, ఎంపీవో, కార్యదర్శి అంగన్ వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

● 600 మొక్కలను గ్రామస్థుల ఆధ్వర్యంలో నాటారు

మండలంలోని నడిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోగల యూపీఎస్ పాఠశాలలో 600మొక్కలు ఈవో నిట్టు కిషన్‌రావు, హెచ్‌ఎం సురేశ్ ఆధ్వర్యంలో గ్రామస్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మూకుమ్మడిగా నాటారు. మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో వాటి సంరక్షణ కు అంత కంటే ముఖ్యమని ఈవోకిషన్ తెలిపారు.ఈ కార్యక్రమంలో రజత్ కుమార్, సంతోశ్, రాము, పాల్గొన్నారు.

మాక్లూర్:మాక్లూర్ మండల గ్రామమైన చిక్లీలో స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలను తొలగించాలని అదే విధంగా మొక్కలను నాటాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. ఈకార్యక్రమంలో స్పెషల్‌ఆఫీసర్ అనిల్, వైద్య సిబ్బంది రేణుక, ఐసీడీఎస్ సిబ్బంది, సెక్రెటరీలు, తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్ల: స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా బుధవారం మండ లంలోని గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు, రైతు వేదికలు,పల్లె ప్రకృతి వనాల్లో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పశువైద్యశాల వద్ద పిచ్చి మొక్కలను తొలగించడంతో పాటు, మురుగు కాలువల్లో దోమల నివారణకై ఫాగింగ్ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో శివచరణ్, కార్యదర్శి జాకీర్ హుస్సేన్, ఆశావర్కర్‌లు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

రెంజల్: ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా ఏర్పాటు చేసిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మండలంలోని తాడ్‌బిలోలి గ్రామంలో చేపడుతున్న పనులను బుధవారం డీఎల్‌పీవో మధుకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా చెత్తను, ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్ర గౌడ్, ఫీల్డ్ అసిస్టెంట్ మధు తదితరులు పాల్గొన్నారు.

యానంపల్లిలో లేగదూడపై చిరుతదాడి

● లేగదూడ కళేబరం లభ్యం ● భయాందోళనలో గ్రామస్థులు ● ఘటన స్థలాన్ని పరిశీలించిన అటవీ అధికారులు

డిచ్‌పల్లి,ఆగస్టు 7: డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని యానంపల్లి అటవీ పరిధిలో గత రెండు రోజుల క్రితం లేగదూడపై చిరుత దాడి చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఇందల్వాయి అటవీ శాఖ అధికారులు ఘటన స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. యానంపల్లి శివారులోని తోట మనోజ్ కుమార్ కు చెందిన కొట్టంలో లేగ దూడపై మంగళవారం తెల్లవారు జామున చిరుత దాడి చేసింది. ఉదయం వచ్చే సారి లేగదూడ మరణించడంతో వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు వినయ్, శ్రీకాంత్ లు ఘటన స్థలాన్ని పరిశీలించి స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రేంజ్ అధికారి రవి మోహన్ భట్ మాట్లాడుతూ.. లేగదూడపై చిరుత దాడి చేసినట్లు ప్రాథమిక గా గుర్తించామని ఆయన తెలిపారు. కాగ చిరుత సంచార వార్తతో యానంపల్లి గ్రామంలో భయందోళన నెలకొన్నాయి.



లేగదూడ కళేబరాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

గ్రామాల్లో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

డిచ్‌పల్లి,ఆగస్టు7:తల్లిపాలవారోత్సవాలను అన్నిగ్రామాల్లోఅంగన్ వాడీ కార్యకర్తలు తల్లిపాలవారోత్సవాలను విజయవంతం చేయాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని సూపర్‌వైసర్ బుజ్జి అన్నారు. బుధవారం మండలంలోని మెంట్రాజ్‌పల్లిలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె హాజరై మాట్లాడారు.పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించడం వల్లవ్యాధి నిరోధక శక్తి పెరుగుతోందని అమృతంతో సమానమని ఈపాలల్లో వ్యాధినిరోధక శక్తి అధికంగా ఉంటుందన్నారు. తల్లిపాలు ఇవ్వడంతో తల్లికి ఎలాంటి సమస్యలు రావని, రొమ్ముక్యాన్సర్ రాకుండా అడ్డుకుంటుందన్నారు. సమాజంలో బిడ్డ చెడువసనలకు దూరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ ఎంభాను, ఆరోగ్య సిబ్బంది సుమలత, టీచర్స్, ఆశ వర్కర్స్, కార్యదర్శి శ్రవణ్ పాల్గొన్నారు.

● రాంపూర్‌లో తల్లిపాల వారోత్సవాలు

మండలంలోని రాంపూర్‌లో ఆరోగ్య కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను ఆరోగ్య కార్యకర్త సుమలత ప్రారంభించారు.పుట్టిన బిడ్డకు తల్లిపాలు మాత్రమే తాగించాలని శారీరక పరిపుష్టికి తల్లిపాలు ఎంతో దోహదం చేస్తాయన్నారు.శిశువుజబ్బు చేసిన తల్లిపాలేతాగించలన్నారు.తల్లి నుంచి శిశువుకు తల్లి వెచ్చదనం లభిస్తుందన్నారు.ఈకార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌డీ రేణుక,అంగన్‌వాడీ సిబ్బంది ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

మాక్లూర్: మాక్లూర్ మండల గ్రామమైన చిక్లీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పుట్టిన బిడ్డకు తల్లిపాలు అందించాలని ఎంపీవో శ్రీనివాస్ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని చిక్లీ గ్రామంలో ఆయన పాల్గొన్నారు. గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరీలు చేసుకోవాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ అనిల్, వైద్యసిబ్బంది రేణుక, ఐసీడీఎస్ సిబ్బంది, ఆశావర్కర్‌లు, అంగన్‌వాడీలు, పంచాయతీసెక్రెటరీలు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో పాల ప్యాకెట్లను అందజేస్తున్న దృశ్యం

కమ్మర్‌పల్లి: పుట్టిన గంట నుంచి ఆరునెలలవరకు బిడ్డకు తల్లి పాలు పట్టడం శ్రేయస్కరమని, బిడ్డకు ఈపాలు మంచి ఆరోగ్యనిస్తాయని రోగనిరోధక శక్తిని పెంచుతాయని హెల్త్‌సూపర్‌వైజర్ స్వరూప అన్నారు.బుధవారం కమ్మర్‌పల్లి మండలం కోనాసముందర్‌లో తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా తల్లిపాలు, పౌష్టికాహారం తదితర అంశాల పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక ఏఎన్‌ఎం రూప, ఐకేపీ అధ్యక్షురాలు మౌనిక, మేఘన,లక్ష్మీ, లాడెలలిత, వీవోఏ లత, అంగన్ వాడి టీచర్లులక్ష్మీ, పుష్ప, ఆయాలు బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

నవీపేట: మండలంలోని మోకన్‌పల్లి పంచాయతీ పరిధిలోని అంజుమాన్ ఫారం, నవీపేట, అబ్బాపూర్(బి)లలో బుధవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సీడీపీవో స్వర్ణలత, సూపర్‌వైజర్‌లు భాగ్యలక్ష్మి, రాధాలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా చేనేత దినోత్సవం



ఈరవత్రి అనిల్‌ను సన్మానిస్తున్న పద్మశాలీ సంఘ అధ్యక్షుడు శేఖర్

ఆర్మూర్‌టౌన్,ఆగస్టు7: పట్టణంలోని పద్మశాలి సంఘం మూడో తర్ఫ ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా చేనేత సహకార సంఘంలో పని చేస్తున్న చేనేత కార్మికులను పట్టుశాలువ,పూలమాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం పద్మశాలి సంఘం అధ్యక్షుడు చిట్ల యగ్నేష్ మాట్లాడుతూ చేనేత కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, డబుల్‌బెడ్‌రూం ఇళ్లు కట్టి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో పద్మశాలి సంఘం మూడో తర్ఫ కార్యదర్శి న్యాక మోహన్, గురుడు రాంచందర్, దోమల శ్రీనివాస్, అంబాటి శీను, చిట్లచిన్న గంగాధర్, గణపతి, శేఖర్, శీను, లింబాద్రి, తదితరులు పాల్గొన్నారు.

రుద్రూరు: రుద్రూరు మండల కేంద్రంలో చేనేత సహకార సంఘంలో బుధవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీనియర్ నేత కార్మికులు సుప్పల స్వామి, మోత్కూరి నడ్పి గంగారాం, గట్టు సాయిలు, నూత్‌పల్లి నాగమణిలను సత్కరించారు. చేనేత సంఘం అధ్యక్షుడు మోత్కూరి నారాయణ, మాజీ డైరెక్టర్లు జువ్వల పోతన్న, మాదాస్ మారుతి, మోత్కూరి శంకర్, సంఘం సభ్యులు హన్మాండ్లు, గంగుల గంగాధర్, టి.విజయ్, హంగర్గ గంగాధర్, సంగయ్య, తొప్పరి హన్మాండ్లు, సంఘం సిబ్బంది ఈర్వ నాగరాజు, అంకం నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: ప్రభుత్వం చేనేత కార్మికులను ఆదుకోవాలని మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు నీట్ శేఖర్ కోరారు. బుధవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఖనిజ అభివృద్ధి సంస్థ ఈరవత్రి అనిల్‌ను ఆయన కలిశారు. అనంతరం శాలువ, పూలమాలతో ఘనంగా సత్కరించారు. చేనేతను అభివృద్ధి చేయాలని, పద్మశాలిల అభివృద్ధికి కోసం నిధులు మంజూరు చేయాలని, పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈరవత్రి అనిల్‌కు విన్నవించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం సభ్యులు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జీ ఎస్సై గంగాధర్

మాక్లూర్, ఆగస్టు7: విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఇన్‌చార్జి ఎస్సై గంగాధర్ కోరారు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు నిజామాబాద్ పోలీస్ కళాబృందం బుధవారం మాక్లూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు నాటకాలు, పాటలతో అవగాహన కల్పించారు. వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని, రోడ్డు నియామలు పాటించాలన్నారు. అత్యవసర సమయంలో 100 నెంబర్‌కు డయల్ చేయాలని అన్నారు. ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఇందుకు సంబంధించి 1930టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్‌చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గంగారాంతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



వేల్పూర్ ధర్నా చేస్తున్న సీపీఐఎంఎల్ మాస్‌లైన్ (ప్రజాపంథా) నాయకులు

వేల్పూర్, ఆగస్టు7: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు ఆరు గ్యారెంటీ పథకాలు అమలుపర్చాలని డిమాండ్ చేస్తూ బుధవారం వేల్పూర్ తహసీల్దార్ కార్యాలయం ముందు సీపీఐఎంఎల్ మాస్‌లైన్ (ప్రజాపంథా) నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) డివిజన్ కార్యదర్శి బి.దేవరాం మాట్లాడుతూ ప్రభుత్వం నిరుపేదలకు ఇళ్లస్థలాలు, రేషన్‌కార్డులతో పాటు ఆరు గ్యారెంటీ పథకాలను పేదలకు అందజేయాలని డిమాండ్ చేశారు.విద్యార్థులకు ఎలాంటి రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయకపోవడం బాధకరమన్నారు. అర్హులైన పేదలకు ఇళ్లు కట్టించి ఇవ్వాలని, తెల్ల రేషన్‌కార్డులను విడుదల చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్ నాయకులు అమీనాపూర్ రాజేశ్వర్, నరేందర్, మాచర్ల రాజన్న, అనిల్‌కుమార్, మమత, కలిగోట రాజు, తదితరులు పాల్గొన్నారు.

కోటగిరిలో పీడీఎస్ బియ్యం పట్టివేత

కోటగిరి,ఆగస్టు7:కోటగిరి మండల కేంద్రంలోని ఓరైస్‌మిల్లులో సుమారు 270క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్నిడీటీ ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ అధికారులుపట్టుకున్నారు. మండల కేంద్రంలోని ఎత్తొండ రహదారిలో ఓ రైస్‌మిల్లుపై మంగళవారం టాస్క్‌ఫోర్స్ ఏసీపీ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. రైస్‌మిల్లులో పీడీఎస్ బియ్యంతో ఉన్న లారీని అధికారులు పట్టుకున్నారు. డీటీ ఎన్స్‌ఫోర్స్‌మెంట్ అధికారి నిఖిల్ రాజ్ బుధవారం లారీని పరిశీలించారు. లారీలో ఉన్న పీడీఎస్ బియ్యంతో పాటు లారీని సీజ్ చేశారు. సుమారు 4.50లక్షల విలువ కలిగిన బియ్యాన్ని పట్టుకున్నామని ఆయన తెలిపారు. పక్క సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. గత పది రోజుల క్రితం ఇదే రైస్‌మిల్లులో పీడీఎస్ బియ్యం పట్టుబడడం విశేషం. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీటీ ఎన్స్‌ఫోర్స్‌మెంట్ అధికారి వెల్లడించారు. ఈ దాడిలో టాస్క్‌ఫోర్స్ సీఐ పురుషోత్తం, రుద్రూర్ సీఐ జయేష్‌రెడ్డి, ఎస్ఐ తదితరులు పాల్గొన్నారు.



పీడీఎస్ బియ్యం పట్టుకున్న అధికారులు



నిరసన తెలుపుతున్న ఎరుకుల కులస్తులు

ఎరుకుల కులం ఐక్యపోరాట సమితి నిరసన

కామారెడ్డి టౌన్, ఆగస్టు 7: తెలంగాణ ఎరుకల హక్కుల ఐక్యపోరాట సాధన సమితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వల్ల ఎరుకల ఉప కులాలకు అన్యాయం జరిగిందన్నారు. ఇందిరాగాంధీ సమయంలో తమ కులస్తులను గిరిజనులుగా గుర్తించారన్నారు. ప్రస్తుత వర్గీకరణ వల్ల 33 ఉప కులాల్లో కేవలం రెండు కులాలకు మేలు జరుగుతుందన్నారు. తమ కులవృత్తులైన బుట్టలు అల్లడం, పందుల పెంపకం అంతరించిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వర్గీకరణలో మిగిలిన ఎరుకుల ఉపకులాలకు కూడా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎరుకల కులస్తుల హక్కుల సాధన కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకుని తమకు న్యాయం జరిగే విధంగా కృషి చేయాలని కోరారు. అంతకుముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు.

హెడ్‌కుక్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

బీర్కూర్, ఆగస్టు 7:మండలంలోని కేజీబీవీ పాఠశాలలో హెడ్‌కుక్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేజీబీవీ ప్రత్యేక అధికారిని గీత పేర్కొన్నారు. ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకునేందుకు పదవ తరగతి ఉత్తీర్ణులై 25 నుంచి 40ఏళ్ల లోపు వయసు కలిగిన మహిళలు మాత్రమే అర్హులన్నారు. దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆమె తెలిపారు.

రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన

మద్నూర్, ఆగస్టు 7: మండలంలోని మేనూర్ తెలంగాణ మోడల్ పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అధికారులు అవగాహన కల్పించారు. బుధవారం మోడల్ పాఠశాల ఆవరణలో సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థులు రోడ్డుపై నడిచేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారికి సూచించారు. ఈ కార్యక్రమానికి సంఘటన మేనేజర్ సౌరబ్ ప్రతాప్‌సింగ్, మహ్మద్ ఖాజా, సేఫ్టీ మేనేజర్ బాలరాజ్, హైవే పెట్రోలింగ్ బృందం సభ్యులు పాల్గొని ట్రాఫిక్ భద్రత సూచనలను విద్యార్థులకు తెలియజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు.

మండల పరిషత్ కార్యాలయంలోకి సబ్ ట్రెజరీ

మద్నూర్, ఆగస్టు 7: మండల కేంద్రంలోని సబ్ ట్రెజర్ కార్యాలయం ఇటీవల వర్షానికి రెండు సార్లు పై కప్పు కూలడంతో కంప్యూటర్లు పని చేయకుండా వృథాగా ఉన్నాయి. కాగా జిల్లా అధికారుల ఆదేశం మేరకు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎస్‌టీవో కార్యాలయాన్ని షిఫ్ట్ చేసినట్లు అధికారులు వెల్లడించారు.

ఎన్‌హెచ్‌ఆర్సీ జిల్లా ఉపాధ్యక్షుడిగా సందీప్

భిక్కనూరు, ఆగస్టు 7: జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్‌హెచ్‌ఆర్సీ) కామారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడిగా భిక్కనూరు మండలంలోని కాచాపూర్ గ్రామానికి చెందిన సందీప్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా విజయ్‌భాస్కర్ ఎన్నికయ్యారు. వీరికి బుధవారం జిల్లా అధ్యక్షుడు మహిపాల్ నియమాక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో భిక్కనూరు మండల అధ్యక్షుడు గంగల రవీందర్, ఉపాధ్యక్షుడు సందీప్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సింగీతం నీటి విడుదల

నిజాంసాగర్, ఆగస్టు 7: నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి ఎలాంటి వరదనీరు రావడం లేదు. సింగూరు ప్రాజెక్టులో 391 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. సింగూరులో 523.600 మీటర్లకు గాను 519.930 మీటర్ల నీటి నిల్వలున్నాయి. ప్రస్తుతం 14.712 టీఎంసీల నీరు నిల్వ ఉంది. సింగూరులో స్వల్పంగా వరద నీరు వస్తున్నా, నిజాం సాగర్‌లో మంజీరా వెంట ఎలాంటి వరద నీరు రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. 1405 అడుగులకు 1389.55 అడుగుల నీటి సామర్థ్యం కలిగి ఉంది. 17.802 టీఎంసీలకు గాను 3.866 టీఎంసీల నీరు నిల్వ ఉంది. సింగీతం రిజర్వాయర్‌లోకి ఎగువ నుంచి 324 క్యూసెక్కుల వరద నీరు వస్తుండటంతో ఒక గేటును ఎత్తి 324 క్యూసె క్కుల నీటిని నిజాంసాగర్ ప్రధాన కాల్వలోకి వదిలి వేస్తున్నారు. సింగీతం వరద నీటితో రైతులు చెరువులు, కుంటలు నింపుకుంటున్నారు. సింగీతంలో 416.550 మీటర్లకు గాను పూర్తి నీటి సామర్థ్యం నిల్వ చేస్తున్నారు. బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ సింగూరు, నిజాంసా గర్‌లో అడుగంటిన స్థాయిలో ఉండటం గమనార్హం.



ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు

రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

కామారెడ్డి టౌన్, ఆగస్టు 7: హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించిన ఏఎఫ్ఐ జావిలిన్‌త్రో రాష్ట్రస్థాయి పోటీల్లో అసోసియేషన్ క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు కామారెడ్డి జిల్లా అథ్లెటిక్స్ అసోయేషన్ ప్రధాన కార్యదర్శి అనిల్ తెలిపారు. కే.ప్రవీణ్ అండర్ 14 విభాగంలో 100 మీటర్ల పరుగు పందెంలో గోల్డ్ మెడల్, ఈశ్వర్ అండర్ 18 విభాగంలో జావిలిన్‌త్రోలో గోల్డ్‌మెడల్, శ్రీను అండర్-14 విభాగంలో 400 మీటర్స్ విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించినట్లు తెలిపారు.

జిల్లాలో స్వచ్ఛదనం - పచ్చదనం

బిచ్కుంద, ఆగస్టు 7: పార్టీలకు, ప్రజాప్రతినిధులకు కష్టపడి పని చేసే కార్యకర్తలే వారసులని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. బుధవారం మండలంలోని కందర్‌పల్లి గ్రామంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో పాల్గొని పర్యావరణ పరిరక్షణ గ్రామాల పరిశుభ్రత ప్రతీ ఒక్కరి బాధ్యతలని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం సద్గురు బండాయప్ప కల్యాణ మండపంలో మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు ఎమ్మెల్యేగా నన్ను గెలిపించుకోవడంతోనే పార్టీ కార్యకర్తలు ఎంత బలంగా ఉన్నారో అర్థమవుతుందన్నారు. రెండు, మూడు నెలల్లో సర్పంచ్ ఎన్నికలు రావచ్చునని మండలంలోని గ్రామ పంచాయతీల్లోని గ్రామాల సర్పంచ్‌గా అన్నింటిని గెలుచుకునే విధంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు మల్లికార్జున్ అప్పశెట్కార్, రాష్ట్ర పీసీసీ డెలిగేట్ సభ్యుడు విఠల్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, పార్టీ అధ్యక్షుడు గంగాధర్, నాగ్‌నాథ్‌పటేల్ తదితర నాయకులు పాల్గొన్నారు.

రోడ్లు, మురికికాలువలకు మరమ్మతు పనులు

కామారెడ్డి టౌన్: పట్టణంలోని గొల్లవాడ, అశోక్‌నగర్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ రోడ్లు, మురికి కాలువలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా పలు కాలనీల్లో పనులు చేపట్టడంతో పాటు గుంతలమయమైన రోడ్లు, మురికి కాలువల మరమ్మతులు చేయిస్తామని తెలిపారు. మంచినీళ్ల సమస్య తలెత్తకుండా చూడాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సుజాత, వార్డు కౌన్సిలర్‌లు వంశీ, నరేందర్, భాస్కర్‌గౌడ్, వనిత తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడ: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని బాన్సువాడ ఆర్డీవో రమేష్ రాథోడ్ పేర్కొన్నారు. బుధవారం బాన్సువాడ మండలంలోని సోమేశ్వర్ గ్రామంలో స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరు మొక్కల చొప్పున నాటాలని వాటిని సంరక్షించాల్సిన బాధ్యత తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్ విఠల్, కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

బీర్కూర్: మండల కేంద్రంలో మురికి కాలువలను శుభ్రం చేయడంతో పాటు పిచ్చి మొక్కలను తొలగించారు. వర్షం నీరు చేరిన ప్రదేశాల్లో నీటి కాలువలు తీశారు. ఆ ప్రదేశాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, సీఏలు, జీపీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

నసురుల్లాబాద్: మండలంలోని సంగం గ్రామంలో మండల ప్రత్యేక అధికారి దయానంద్ అధికారులతో కలిసి మొక్కలు నాటారు. గ్రామ పంచాయితీలో జరుగుతున్న శానిటైజర్ పనులను పరిశీలించి గ్రామ సబ్ స్టేషన్ ముందు మొక్కలు నాటారు. గ్రామ ప్రైమరీ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పాల్య విఠల్, గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాన్సువాడ: పట్టణంలోని 13వ వార్డు టీచర్స్ కాలనీలో కౌన్సిలర్ బాడీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాలనీలో పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతూ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మురికి నీరు నిల్వ ఉండకుండా చూడాలని ఆయన ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ మధుబాబు, వార్డు ఆఫీసర్ శ్రీనివాస్, ఆర్పీ వాణి, సభ్యులు నాగలత, రమ్యశ్రీ, సుజాత, మున్సిపల్ సిబ్బంది హన్మాండ్లు ఉన్నారు.

పెద్దకొడప్‌గల్: మండల కేంద్రంలో ప్రత్యేక అధికారి కిషన్‌తో పాటు ఇన్‌చార్జి ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రెడ్డి బాలికల గురుకుల పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. గ్రామాల్లో ప్రత్యేక అధికారులతో పాటు పంచాయతీ కార్యదర్శులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ దశరథం, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేందర్‌రెడ్డి, నాయకులు నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్: జుక్కల్ మండలంలోని ఆయా గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని జడ్పీ సీఈవో చందర్‌నాయక్ మండల అధికారులకు సూచించారు. బస్వాపూర్ శివారులో గల కస్తూర్బా గాంధీ పాఠశాల ఆవరణలో మండల అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, మండల అధికారులు పాల్గొన్నారు.


బిచ్కుందలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంత్‌రావు

ఎల్లారెడ్డి: ఇంటి పరిసరాలను, మురికి కాలువలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నే ప్రభాకర్ అన్నారు. మండలంలోని భిక్కనూరు గ్రామంలో మొక్కలు నాటి, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురికి కాలువలు శుభ్రం చేయాలని నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి, శుభ్రం చేయాలని గుంతల్లో మొరం పోసి చదును చేయాలన్నారు. అదేవిధంగా తిమ్మారెడ్డిలో ఎక్సైజ్ అధికారులు కల్లు గీత కార్మికులతో కలిసి గ్రామ సమీపంలోని ఈత మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ షాబీర్ అహ్మద్, ఎస్సై గంగాధర్, కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు. ఎల్లారెడ్డిలోని 6వ వార్డులో మెప్మా సిబ్బంది ఇంటింటికీ పూల మొక్కలు, పండ్ల మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బాలమణి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో ఆరోగ్య ఉప కేంద్రంతో పాటుగా గ్రామంలో ఆలయాలు, తదితర ప్రాంతాల్లో గ్రామ పంచాయతీ సిబ్బంది, వైద్య సిబ్బంది, నాయకులు, యువకులు పిచ్చిమొక్కలను, ముళ్లపొదలను తొలగించి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఈవో లక్ష్మీ, మాజీ ఎంపీటీసీలు సాయిగౌడ్, మంజుల, వైద్య, పంచాయతీ సిబ్బంది, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.


అశోక్‌నగర్‌లో ఏర్పడిన గుంతలను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్


సోమేశ్వర్ గ్రామంలో మొక్క నాటుతున్న ఆర్డీవో రమేష్ రాథోడ్


ఎల్లారెడ్డిలో గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న ఆర్డీవో మన్నే ప్రభాకర్

అసంపూర్తిగా ఉన్న పాఠశాలను మూసి వేయాలని వినతి

పెద్ద కొడప్‌గల్, ఆగస్టు 7: జుక్కల్ మండలంలోని పెద్ద గుల్ల గ్రామ శివారులో నిర్మాణం పూర్తి చేయకుండానే అసంపూర్తిగా ఉన్న ప్రైవేట్ పాఠశాలలో విద్యాబోధన చేస్తున్నారని అసంపూర్తిగా మారిన పాఠశాలను మూసివేయాలని కోరుతూ బుధవారం ఎస్ఎఫ్ఐ నాయకులు మండల విద్యాశాఖ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్ఎఫ్ఐ కార్యదర్శి అజయ్ మాట్లాడుతూ పెద్దగుల్ల గ్రామ శివారులో కొంతమంది ప్రైవేట్ పాఠశాలను నిర్వహిస్తున్నారని, అయితే ఈ పాఠశాల పూర్తిగా నిర్మాణం పూర్తి చేయకుండానే తరగతులు నిర్వహిస్తున్నారని తెలిపారు. అంతేగాక పాఠశాల తరగతి గదులు నిర్మించే వాటిలోనే స్టీలు, సిమెంట్ నిలువ ఉంచారని, భవనం పూర్తి కాకుండానే తరగతులు నిర్వహించడం వల్ల విద్యార్థులకు ప్రమాదం సంభవించే అవకాశం ఉందని తెలిపారు. అంతేగాక పాఠశాలలో తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం లేదని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి ఈ అసంపూర్తిగా ఉన్న పాఠశాలలో తరగతులు కొనసాగకుండా చర్యలు తీసుకోవాలని, లేదంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు ఫిర్దోస్, నాయకులు సునీల్ తదితరులు పాల్గొన్నారు.


బీర్కూర్ ప్రయాణ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రయాణ ప్రాంగణానికి మరమ్మతులు చేపట్టాలి

బీర్కూర్, ఆగస్టు 7: మండల కేంద్రంలోని ప్రయాణ ప్రాంగణానికి మరమ్మతులు చేపట్టాలని, బస్సులు ప్రాంగణానికి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు ఆర్టీసీ అధికారులకు విన్నవించారు. బుధవారం కాంగ్రెస్ నాయకులు బీర్కూర్‌లో కొనసాగుతున్న రహదారి విస్తరణ పనులు, ప్రయాణ ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీర్కూర్ మండల కేంద్రంలో గత కొన్ని రోజులుగా రహదారి విస్తరణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డు ఎత్తు పెరిగిందన్నారు. దీంతో ప్రయాణ ప్రాంగణంలో లోతట్టుగా మారి వరద నీరు చేరడంతో ప్రయాణ ప్రాంగణంలోకి ప్రయాణికులు, బస్సులు వెళ్లలేని పరిస్థితి దాపురించిందన్నారు. ఆర్టీసీ అధికారులు వెంటనే స్పందించి ప్రయాణ ప్రాంగణానికి మరమ్మతులు చేపట్టాలన్నారు. బాన్సువాడ, బోధన్ డిపోల నుంచి వచ్చే బస్సులు ప్రాంగణంలోకి రావడం లేదని, దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బాన్సువాడ నుంచి వచ్చే బస్సులు కామప్ప చౌరస్తా వరకు వచ్చి తిరిగి వెళుతున్నాయన్నారు. ఆర్టీసీ అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విజయ్, ప్రకాష్, మాజీ ఎంపీటీసీ సందీప్, మాజీ ఉప సర్పంచ్ మన్నాన్, సంతోష్, రాజు, రాజేశ్వర్‌రావు, అశోక్, రఘు, రహీం పాల్గొన్నారు.

మహిళా రైతుపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలి

- సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ

మాచారెడ్డి, ఆగస్టు 7: మహిళ రైతుపై విచక్షణ రహితంగా దాడి చేసిన ఫారెస్ట్ అధికారులపై కేసు నమోదు చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ అన్నారు. పల్వంచమర్రి మండలం ఇసాయిపేట శివారు గల వడ్డెర కాలనీలో కొన్ని కుటుంబాలు గత 50 నుంచి 60 సంవత్సరాలుగా జీవనం సాగిస్తున్నారు. అదే ప్రాంతంలో సాగు భూమిని సాగు చేస్తున్నారని వర్షా కాలం సమీపించడంతో మక్క విత్తనాలు వేశారు. అటువచ్చిన ఫారెస్ట్ అధికారులు పారవేసిన మొక్కలను ధ్వంసం చేస్తున్నప్పుడు అక్కడే ఉన్న మహిళ అడ్డుకోవడానికి వెళితే మహిళ అని చూడకుండా విచక్షణ రహితంగా ఆమెను కొట్టారన్నారు. ఏదైన ఉంటే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలే కాని భౌతిక దాడి చేయడం సరికాదన్నారు. మహిళపై దాడి చేసిన అధికారులపై చట్టప్రకారం చర్యలు తీసుకుని వారిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ప్రకాష్, సురేష్, కిషోర్, రైతులు రాములు, కుమార్, శ్రీకాంత్, లక్ష్మీసరిత తదితరులు పాల్గొన్నారు.


దామరంచ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

బీర్కూర్, ఆగస్టు 7: బీర్కూర్ మండలం దామరంచ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం కామారెడ్డి పోలీసు కళా బృందం వారు కళాజాతా కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాజాతా బృందం వారు తమ ఆట, పాటలు, నాటికలతో విద్యార్థులకు టీ సేఫ్, సైబర్ క్రైమ్, షీ టీమ్, రోడ్డు సేఫ్టీ, నూతన చట్టాలు, మానవ అక్రమ రవాణా తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాజాతా బృందం వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కొత్త చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. టీ సేఫ్‌ను ప్లే స్టోర్ నుంచి ఇన్‌స్టాల్ చేసుకునే విధానాన్ని, ప్రయాణ సమయంలో ఆపదలో ఉన్నప్పుడు ఉపయోగించుకునే విషయాలను విద్యార్థులకు వివరంగా చెప్పారు. మహిళలు ఆపద సమయంలో షీ టీమ్ ఫోన్ నెంబర్ 8712686094 ఫోన్ చేయాలని, సైబర్ నేరాలు జరిగినప్పుడు టోల్‌ఫ్రీ నెంబర్ 1930కు కాల్ చేయాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో టోల్‌ఫ్రీ నెంబర్లు 100, 108, 1930, 181లకు కాల్ చేయాలని, ఏఏ టోల్ ఫ్రీ నెంబర్లను దేనికి వినియోగించాలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీర్కూర్ పోలీసు సిబ్బంది, కళాబృందం సభ్యులు, షీ టీమ్ సభ్యులు, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్: కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన మూడు కొత్త చట్టాలపై విద్యార్థులతో పాటు ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రధానోపాధ్యాయుడు దామోదర్‌రెడ్డి తెలిపారు. బుధవారం సదాశివనగర్ ఉన్నత పాఠశాలలో ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు కొత్త చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహచట్ట ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి: సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని బుధవారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులు ఎవరైనా ఫోన్‌లు చేస్తే వారికి వ్యక్తిగత వివరాలు తెలుపవద్దని, వాట్సాప్‌లో లింక్‌లు పంపితే క్లిక్ చేయకూడదని, ఓటీపీలు గుర్తు తెలియని వ్యక్తులు అడిగితే చెప్పి మోసపోవద్దని సైబర్ నేరాల పట్ల చాలా జాగ్రత్తగా ఉండాలని, ఎవరైనా ఇబ్బందులకు గురి చేసినట్లయితే 1930 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


కోర్టులో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

కోర్టు వద్ద న్యాయవాదుల నిరసన

కామారెడ్డి టౌన్, ఆగస్టు 7: జనగామలో న్యాయవాద దంపతులపై జరిగిన దాడిని నిరసిస్తూ బుధవారం కామారెడ్డి జిల్లా కోర్టులో న్యాయవాదులు నల్ల బ్యాడ్జీలు ధరించి కోర్టు విధులకు హాజరవడంతో పాటు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనగామ పోలీసుల చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని న్యాయవాదులపై దాడులు చేయడం సిగ్గుచేటని అన్నారు. ఈ మధ్య కాలంలో న్యాయవాదులపై దాడి చేయడం పోలీసులకు పరిపాటిగా మారిందని ఈ విషయంపై సదరు పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. న్యాయవాదుల రక్షణ కోసం చట్టం అమలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్, న్యాయవాదులు జగన్నాథం, శంకర్‌రెడ్డి, అన్వర్ షరీఫ్, సిద్ధిరాములు, శ్యామ్ గోపాల్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ పేరుపై డబ్బులు అడుగుతున్న వారిపై కేసు

కామారెడ్డి టౌన్, ఆగస్టు 7: కామారెడ్డి జిల్లా కలెక్టర్ అశిష్ సంగ్వాన్ వాట్సాప్ డీపీతో డబ్బులు అడుగుతున్న విషయంలో కేసు నమోదు చేసినట్లు దేవునిపల్లి ఎస్సై రాజు బుధవారం తెలిపారు. సోషల్ మీడియాలో కలెక్టర్ డీపీ ద్వారా డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ప్రజలెవరూ స్పందించవద్దని ఆయన తెలిపారు. కొందరు అధికారులను సైబర్ నేరగాళ్లు వాట్సాప్ కాల్ చేస్తూ డబ్బులు అడిగినట్లు తెలిసింది. సైబర్ నేరస్తులను పట్టుకుని శిక్షించాలని కలెక్టర్ కార్యాలయ సిబ్బంది ఏవో అహ్మద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారని ఎస్సై తెలిపారు.

కంచర్లలో విద్యుత్‌షాక్‌తో ఒకరి మృతి

భిక్కనూరు, ఆగష్టు 7: వ్యవసాయబావి వద్ద స్టార్టర్ డబ్బాలో ఫీజ్ వైరును సరిచేస్తుండగా విద్యుత్‌షాక్ తగిలి ఒకరు మృతి చెందిన సంఘటన భిక్కనూరు మండలంలోని కంచర్ల గ్రామంలో చోటు చేసుకుంది. భిక్కనూరు ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మట్టె స్వామిరెడ్డి(37) తన వ్యవసాయ బావి వద్ద వరి పొలానికి నీరు పెట్టివస్తానని చెప్పి మంగళవారం సాయంత్రం వెళ్లి రాత్రైనా తిరిగి రాలేదు. దీంతో అర్ధరాత్రి అతడి తండ్రి లింగారెడ్డి, కుటుంబ సభ్యులు వ్యవసాయ బావి వద్దకు వెళ్లి చూడగా స్టార్టర్ డబ్బా వద్ద ఫీజ్ వైరును సరి చేస్తుండగా సర్వీస్ వైరుకు స్వామి తగలడంతో విద్యుత్‌షాక్‌తో అక్కడికక్కడే మృతి చెంది ఉన్నాడు. దీంతో మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

శునకాలకు చికిత్స

దోమకొండ, ఆగస్టు 7: మండల కేంద్రంలోని పశు వైద్యాసుపత్రిలో బుధవారం వైద్యాధికారి శివ శునకాలకు ఇంజక్షన్ వేశారు. వివిధ రకాలుగా ఇబ్బందులు పడుతున్న పశువులు, కోళ్లు, శునకాలకు పరీక్షలు చేసి చికిత్స అందించినట్లు వైద్యుడు తెలిపారు. రైతులు, గొర్రెల కాపారులు తమ పశువులు, గొర్రెలు, మేకల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, రైతులు పాల్గొన్నారు.

అదనపు బస్సు సర్వీసులను ఏర్పాటు చేయాలి

బాన్సువాడ టౌన్, ఆగస్టు 7: బాన్సువాడ, జుక్కల్ రూట్లలో విద్యార్థుల సౌకర్యార్థం అదనపు బస్సు సర్వీసులను ఏర్పాటు చేయాలని బాన్సువాడ బీజేపీ నాయకులు బుధవారం ఆర్టీసీ డిపో మేనేజర్ సరితా దేవిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి రోజూ బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల నుంచి పాఠశాల, కళాశాల విద్యార్థులు బాన్సువాడ పట్టణానికి చదువుకునేందుకు వస్తున్నారని, కానీ బస్సు సర్వీసులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అదేవిధంగా పాత బాన్సువాడ నుంచి సుమారు 100 మంది విద్యార్థులు కొత్తాబాది మోడల్ పాఠశాలకు వెళ్తున్నారని, వారి కోసం పాత బాన్సువాడ నుంచి బస్సు సర్వీసు ఏర్పాటు చేయాలని డిపో మేనేజర్‌ను కోరినట్లు వారు తెలిపారు. ఆర్టీసీ అధికారులు విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గుడుగుట్ల శ్రీనివాస్, కోనాల గంగారెడ్డి, భాస్కర్‌రెడ్డి, శంకర్‌గౌడ్ తదితరులున్నారు.


ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి	
శాంతి	ఓసీ
దర్శన్	శివంభజే
ప్రియా 70	కల్కి
ప్రియా 35	రాయన్, బడ్డీ

బాన్సువాడ	
మహేశ్వరి	రాయన్
వెంకటేశ్వర	శివం భజే

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	160	200	220
వెన్‌కాబ్(కిలో)	170	220	230

